సాక్షి కర్నూలు

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



జ్వాలావీరభద్ర స్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి , ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ దక్షిణమాఢవీధిలో నిత్యకళావేదికపై బుధవారం హైదరాబాద్‌కు చెందిన కె.రమ్య బృందం భక్తి గీతాలకు ప్రదర్శించిన నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మానవీయతకు ప్రతి రూపం..


అల్లా మార్గంలో నడిపించిన మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

8లో▸

సంక్షేమ బావుటా!

నాలుగేళ్లలో రూ.3.02లక్షల కోట్లకుపైగా ఖర్చు

- డీబీటీ ద్వారానే రూ.2.11లక్షల కోట్లకు పైగా జమ
- నాన్ డీబీటీ ద్వారా మరో రూ.91.03కోట్లు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు దక్కిన ప్రాధాన్యం
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు
- పాడిపరిశ్రమ, చిరు వ్యాపారాలతో జీవనం
- పల్లెల్లో మారుతున్న జీవన విధానం



ఏపీ నెట్‌వర్క్:

ఒక పాలకుడికి ముందు, ఆ తర్వాత అని చెప్పుకునేలా కొందరు మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తారు. అలా మన రాష్ట్రాన్ని పాలించిన వారిలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒకరు. ఎందుకంటే పైన పేర్కొన్న కుటుంబాలే కాదు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్లలో 10.48కోట్ల మందికిపైగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందడంతో వారి జీవన విధానమే మారిపోయింది. దేశ చరిత్రలో ఓ ప్రభుత్వం తమ ఐదేళ్లకాలంలో మొదటి నాలుగేళ్ల ప్రజల సంక్షేమం కోసం ఇంతలా ఖర్చు చేసిన రాష్ట్రం మరొకటి లేదు. పైగా ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఏ రాజకీయ నాయకుడి ఇంటి చుట్టూ సిఫార్సు కోసం వెళ్లకుండా అర్హత ఉంటే చాలు ప్రభుత్వ తరఫున వలంటీర్ వచ్చి తలుపు తట్టి దరఖాస్తు నుంచి నగదు ఖాతాల్లో జమ అయ్యే వరకూ బాధ్యత తీసుకుని సంక్షేమ ఫలాలను ఇంటికి చేరుస్తున్నారు. ఇలా సంక్షేమ పథకాల ద్వారా వచ్చిన డబ్బుతో పాడి పశువులు, కుటీర పరిశ్రమలు, బొటిక్ లాంటి వ్యాపారాలు, పిల్లలకు మంచి చదువు, సంప్రదాయ పంటలు కాకుండా ఉద్యానపంటల సాగు చేస్తూ సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా ఒక్కో మెట్టూ ఎదుగుతూ సంతోషంగా జీవిస్తున్నారు.

దేశ చరిత్రలో సంక్షేమ విప్లవం

సరిగ్గా 20 ఏళ్ల కిందట 2004కు ముందు గ్రామంలో ఎవరికైనా పింఛన్ రావాలంటే ఊళ్లో ఇది వరకూ పింఛన్ వస్తున్న వారు చనిపోవాలి. అప్పుడే ఆ స్థానంలో మరొకరికి పింఛన్ ఇస్తారు. ఇచ్చే పింఛన్ రూ.60మాత్రమే. ఇదే అప్పట్లో పెద్ద సంక్షేమం. పేదల బాధలు, రైతుల కన్నీళ్లు, విద్యార్థుల భవిష్యత్తు గురించి అప్పటి ప్రభుత్వం ఆలోచించిన దాఖలాలు లేవు. ఆ తర్వాత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పేదల గురించి ఆలోచించి గొప్ప పథకాలు చేపట్టి ఐదేళ్లలోనే తన మార్క్‌పాలనను చూపించారు. పేదల ఇళ్లలో దేవుడిగా నిలిచిపోయారు. ఆయన వారసుడిగా 'నాన్న కంటే రెండు అడుగులు ముందుకేస్తా' అని పాదయాత్రలో చెప్పి అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు పాలనలో సంస్కరణలతో పాటు సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో సంక్షేమం కోసం నాలుగేళ్లలో రూ.3లక్షల కోట్లకుపైగా ఏ రాష్ట్రం ఖర్చు చేయలేదు. పాలకుడు ఇంటి పెద్దకొడుకుగా ఆలోచించి పుట్టుక నుంచి చదువు, పెళ్లి, తదితర అన్ని విషయాల్లో అండగా ఉండాలనే ధృడసంకల్పంతో నిర్ణయాలు తీసుకుని వాటిని పక్కాగా చేశాడు. ఈ పాలన చాలా రాష్ట్రాలకు ఆదర్శమైంది.

ప్రతిపక్షాలు సైతం 'సంక్షేమ దారి'లో..

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయి.
- ప్రతిపక్షాలు సైతం బాహాటంగా చెప్పకపోయిన ఇదే పాలన అందిస్తామనే రీతిలో నేరుగా ప్రజలకు వాగ్దానాలు చేస్తున్నాయి.
- ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు రైతుభరోసా, చేయూత, అమ్మ ఒడి లాంటి పథకాలను పేర్లు మార్చి తాము కూడా అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటున్నారు.
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒకవేళ జనసేన అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న ఏ సంక్షేమ పథకాన్ని రద్దు చేయమని, మరిన్ని కొత్తగా అమలు చేస్తామని ప్రకటించారు.

2019 నుంచి 2023 ఏప్రిల్ వరకూ డీబీటీ ద్వారా 28 పథకాలకు సంబంధించి ఖాతాల్లో జమ ఇలా..

మొత్తం లబ్ధిదారులు: 7,90,58,024 / జమ అయిన మొత్తం(రూ.కోట్లలో): 2,11,069.58

నాన్ డీబీటీ ద్వారా నాలుగేళ్లలో సంక్షేమానికి చేసిన ఖర్చు

(జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యా కానుక, ఇళ్ల స్థలాలు, వైఎస్సార్ కంటి వెలుగు, విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ)

మొత్తం లబ్ధిదారులు: 2,57,58,134 / జమ అయిన మొత్తం(రూ.కోట్లలో): 91,039.35

వర్గాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపుల కోసం చేసిన ఖర్చు!:

మొత్తం లబ్ధిదారులు: 10,48,16,158 / జమ అయిన మొత్తం(రూ.కోట్లలో): 3,02,108,93

కుటుంబాన్ని నిలబెట్టారు



మాకు రెండెకరాల భూమి ఉంది. మరో ఆరెకరాలు గుత్త(కౌలు)కు తీసుకుని వ్యవసాయం చేశాం. వర్షాలు లేవు, పెట్టుబడి కూడా రాలేదు. రూ.5లక్షలకుపైగా అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చలేక నా భర్త పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నాకు కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబం రోడ్డున పడింది. నా భర్త చనిపోయాక రూ.7లక్షల పరిహారం జగనన్న అందించాడు. నాకు పింఛన్ మంజూరైంది. రైతుభరోసా రూ.58వేలు, చేయూత రూ.56,250 వచ్చింది. అప్పులు చెల్లించాం. ఉన్న డబ్బుతో సంతోషంగా బతుకుతున్నాం.

– మునెమ్మ, రాతన గ్రామం, తుగ్గలి మండలం, కర్నూలు జిల్లా

గౌరవంగా బతుకుతున్నాం



నేను ఐకేపీలో సభ్యురాలిని. భర్త వెంకటరమణతో కలిసి వ్యవసాయ పనులకు పోతుంటి. కొడుకు వాసు 9వ తరగతి, కూతురు వర్షిత 6వ తరగతి చదువుతున్నారు. ఆసరా రూ.11,700, జగనన్న తోడు రూ.21వేలు, అమ్మ ఒడి రూ.42వేలు వచ్చింది. మా అమ్మ వెంకటసుబ్బమ్మకు చేయూత రూ.56,250, అత్త సాలమ్మకు పింఛన్ ద్వారా రూ.1.20లక్షలు మొత్తంగా రూ.2.50,950 లబ్ధి చేకూరింది. ఈ డబ్బుతో బోటిక్ పెట్టుకున్నాం. చీరల వ్యాపారం చేస్తూ, కుట్టమిషన్ తెచ్చుకుని గౌరవంగా బతుకుతున్నాం. ప్రభుత్వం ఆర్థిక భరోసానిచ్చింది.

– చెవుల ఓబులమ్మ, గోపవరం, మహానంది మండలం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపుల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లాంటి వర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. నాలుగేళ్లలో డీబీటీ ద్వారా బీసీలకు రూ.99.68వేల కోట్లు అంటే దాదాపు లక్ష కోట్లు ఖాతాల్లో జమ చేశారు. ఎస్సీలకు రూ.34.96 వేలకోట్లు, ఎస్టీలకు రూ.10.39 వేల కోట్లు, మైనార్టీలకు రూ.11.94, కాపులకు రూ.20.55 కోట్లు కలిపి ఈ ఐదు వర్గాలకు మాత్రమే రూ.1.77 లక్షల కోట్లకు పైగా ప్రయోజనం చేశారు. అలాగే నాన్ డీబీటీ ద్వారా ఈ వర్గాలకు మరో 85.69 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారు. డీబీటీ, నాన్‌డీబీటీ కలిపి సంక్షేమం కోసం ఈ వర్గాలకు మాత్రమే 2.63లక్షల కోట్లకుపైగా ఖర్చు చేశారు.

కాపుల సంక్షేమం కోసం రూ.26.63 వేల కోట్లు ఖర్చు

కాపుల సంక్షేమానికి గత ప్రభుత్వం మాయ మాటలు చెప్పి మోసం చేస్తే ఈ ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో మేలు చేసి చూపింది. ఈ నాలుగేళ్లలో ఏకంగా వీరి సంక్షేమానికి రూ.26.63వేలకోట్లకు పైగా ఖర్చు చేశారు. ఇందులో డీబీటీ ద్వారా రూ.20,550.33కోట్లు నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తే, నాన్ డీబీటీ ద్వారా వీరి సంక్షేమం కోసం మరో రూ.6,084.31కోట్లు ఖర్చు చేశారు. కాపుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేసిన ప్రభుత్వం కూడా రాష్ట్ర చరిత్రలో జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మాత్రమే.

పల్లెల్లో మారిన జీవన విధానం

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలతో పల్లెల్లో జీవన విధానమే మారిపోయింది. సంక్షేమ పథకాలతో ఆర్థికంగా దన్నుగా నిలుస్తూనే మరోవైపు సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్‌క్లినిక్‌లతో పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతీపల్లెలో సగటున 15–20 మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు వచ్చాయి. కొత్తగా ఏర్పాటు చేసిన వ్యవస్థల ద్వారా ప్రతీ గ్రామంలో రోజూ 20–30మందికి పైగా ఉద్యోగస్తులు వచ్చి వెళుతున్నారు. వీరిని చూసి గ్రామంలోని ప్రజల్లో కూడా చైతన్యం పెరిగింది. యువకుల్లో కూడా భవిష్యత్‌పై భరోసా వచ్చి కష్టపడి చదువుతున్నారు. మొత్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి జీవితాల్లో భారీ మార్పులు తీసుకొచ్చాయి.

న్యూస్‌రీల్

మార్లమడికి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని హొళగుంద మండలం మార్లమడికి పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మీనారాయణను జిల్లా కలెక్టర్ సృజన సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు షోకాజ్ నోటీసులు జారీ చేసినా ఆయన పనితీరులో మార్పు కనిపించలేదన్నారు. ఈ నేపథ్యంలో విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

99.24 శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ పంటల ఈ–క్రాప్ నమోదు 99.24 శాతం పూర్తయింది. ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా.. ఇప్పటి వరకు 9.17 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 9.10 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఈ నెల చివరిలోగా 100 శాతం పంటలను నమోదు చేయడంతో పాటు వీఏఏ, వీఆర్‌ఓ ఈ–కేవైసీ అథెంటికేషన్ పూర్తి చేయాల్సి ఉంది. 1,36,459 మంది రైతులు 4.03 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలకు ఈ–కేవైసీ చేయించుకున్నారు. పంటల నమోదుతో పాటు ఈ–కేవైసీ కూడా ఈ నెల చివరిలోపు పూర్తి చేసేలా వ్యవసాయ యంత్రాంగం చర్యలు చేపట్టింది.

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): కడప పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3, 4 తేదీలలో ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామరు. ఆసక్తి కలిగిన 12 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలురు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయ పని వేళల్లో 08518–225419 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 30 నుంచి రెండు నెలలపాటు ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించాలన్నారు. బుధవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండలాధికారులతో సమీక్షించారు. జగనన్న సురక్ష క్యాంపులకు సంబంధించి ఇంటింటి సర్వే ప్రగతిని నివేదికను తనకు ప్రతి గంటకు ఒకసారి పంపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి ఆప్షన్ 1, 2 కింద నిర్మాణంలో ఉన్న ఇళ్లలో ఆదోని, ఆస్పరి, చిప్పగిరి, కోడుమూరు మండలాల్లో జీరో పురోగతి ఉండటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పురోగతిలో వెనుకబడిన కోడుమూరు హౌసింగ్ ఏఈపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు, ఎల్లుండి బాలల సైన్స్‌పై శిక్షణ

కర్నూలు(సెంట్రల్): 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను పురస్కరించుకుని సైన్స్ ఉపాధ్యాయులకు రెండురోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రంగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీన కర్నూలు డివిజన్‌కు సంబంధించి సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు, 30న ఆదోని డివిజన్‌కు సంబంధించి ఆదోని నేషనల్ ఇంగ్లిషు మీడియం స్కూలులో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భూ సంరక్షణలో అక్రమాలపై విచారణ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ భూ సంరక్షణ విభాగానికి సంబంధించి ఆదోని డివిజన్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి విచారణ నిర్వహించారు. 2017–2019 ప్రాంతంలో భూసంరక్షణ విభాగం ఆదోని ఏడీఏగా రామూనాయక్ విధులు నిర్వహించారు. ఈ సమయంలో భూ సంరక్షణకు సంబంధించిన నిధుల వినియోగంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. దీనిపై కొంతమంది రైతులు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ సృజనకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీఏఓతో పాటు అప్పట్లో భూసంరక్షణ విభాగం డీడీ వెంకటేశ్వరరెడ్డి, డీఏఓ కార్యాలయ పరిపాలన అధికారులు, ఆదోని డివిజన్ భూ సంరక్షణ ఏడీ సంధ్యారాణి ఆదోనికి వెళ్లి విచారణ చేపట్టారు. రికార్డులు పరిశీలించడంతో పాటు బాధిత రైతులతో కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

పరిశ్రమలకు సింగిల్ విండోలో అనుమతులు

- ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్‌లో లేకుండా చూడాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండోలో నిర్దేశిత సమయంలోపు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా చూడాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇండస్ట్రీయల్ ప్రమోషన్ అండ్ ఎక్స్‌పోర్టు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సింగిల్ డెస్కు విభాగంలో 86 దరఖాస్తులు రాగా, 73 దరఖాస్తులకు ఆమోదం తెలపగా, మూడింటిని తిరస్కరించారన్నారు. మిగిలిన 10 దరఖాస్తులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. కాగా తిరస్కరించే దరఖాస్తులకు తగిన కారణాలు చూపాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలికి వచ్చిన దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఫోన్ వచ్చినప్పుడు వారి ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పేలా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎంఈజీపీ కింద పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే యువతీ, యువకులను ప్రోత్సహించి పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌లో 86 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉండగా 58 మందికి మంజూరయ్యాయని, ఇందులో 48 గ్రౌండ్ అయినట్లు పరిశ్రమల శాఖ మేనేజనర్ తెలిపారు. ఏపీ బ్యాంకుల్లో దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయో బ్యాంకుల వారీగా పూర్తి వివరాలను లీడ్ బ్యాంకు మేనేజర్‌కు పంపాలని ఇండస్ట్రీస్ జీఎంను ఆదేశించారు. బ్రాహ్మణపల్లి ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్కులోని ప్లాట్లను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి, ఏపీ ఐడీసీడైరెక్టర్ అనుమంరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాదు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ కుమార్‌రెడ్డి, ఐలా ప్రెసిడెంట్ జి.రామకృష్ణారెడ్డి, ఎస్సీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజా మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

కిడ్నీలో రాళ్లకు లేజర్ చికిత్స

- ఆపరేషన్ లేకుండా రాళ్ల తొలగింపు
- పెద్దాసుపత్రిలో నూతన పరికరం ఏర్పాటు



నూతన పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ సీతారామయ్య తదితరులు

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీలో రాళ్లను లేజర్ చికిత్స ద్వారా తొలగించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన పరికరాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఆసుపత్రిలోని యురాలజి విభాగంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, యురాలజి హెచ్‌ఓడీ డాక్టర్ సీతారామయ్య ఈ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యురాలజి విభాగంలో రివాల్వింగ్ ఫండ్ నిధుల నుంచి ఈ పరికరాన్ని కొనుగోలు చేశామన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద రోగులకు ఎలాంటి కోత లేకుండా రెండు సెంటిమీటర్ల వరకు మూత్రపిండంలో ఉన్న రాళ్లను లేజర్ చికిత్సతో తొలగిస్తామన్నారు. ఆసుపత్రిలో ఈ చికిత్స ద్వారా రోగిని మరుసటి రోజునే డిశ్చార్జ్ చేయవచ్చన్నారు. రోగి 48 గంటల తర్వాత సాధారణ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇందు కోసం రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు అవుతుందన్నారు.

3న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(సెంట్రల్): నగర శివారులోని బి.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి పోయిన బయో మెడికల్, అప్లెడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎన్ ప్రసాదు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, పాలిసెట్–2023లో క్వాలీఫై అయినవారు, కాని వారు కూడా ఈనెల 30వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3న స్పాట్ అడ్మిషన్ ఉంటుందన్నారు. సీటు వచ్చిన వారు పదో తరగతి, టీసీ, కులం, ఆధార్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

1న గ్రామ పంచాయతీల్లో శ్రమదానం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అక్టోబర్ 1న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రమదానం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2వ తేదీన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకొని శ్రమదానం నిర్వహించాలన్నారు. గ్రామ ముఖ ద్వారాలు, మార్కెట్ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రార్థనా మందిరాలు తదితర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలన్నారు. శ్రమదానం కార్యక్రమాల్లో చెత్త, చెదారాలను సమీపంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు తరలించేందుకు వీలుగా పారకలు, ట్రై సైకిల్స్, ఇతర పారిశుధ్య పనిముట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని అందరు ఎంపీడీఓ, డీఎల్‌పీఓలు ఈ కార్యక్రమం వందశాతం విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి కనీసం పది ఫొటోలను సిటిజన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

శ్రీమఠంలో వ్యాసరాయ మఠం పీఠాధిపతి



సాయం అందజేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: చాతుర్మాస దీక్ష ముగింపు సందర్భంగా కర్ణాటకలోని కుందాపుర వ్యాసరాయ మఠం పీఠాధిపతి లక్ష్మీంద్రతీర్థులు బుధవారం మంత్రాలయానికి వచ్చారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. స్వామి ముందుగా గ్రామదేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని హారతులు పట్టారు. ఈ సందర్భంగా సుబుధేంద్రతీర్థులు చాతుర్మాస కానుకగా లక్ష్మీంద్రతీర్థులకు రూ.5 లక్షలు నగదు, శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. అలాగే కర్ణాటకలోని అబ్బూరు మఠం అభివృద్ధి కోసం రూ.11.50 లక్షలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పండిత కేసరి గిరియాచార్, మఠం మేనేజర్–2 వెంకటేష్ జోషి, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

నేడు మహా 'మట్టి' గణపతి నిమజ్జనం



భారీ గణనాథుడు

కర్నూలు కల్చరల్: నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 56 అడుగుల మహా మట్టి గణపతికి నేడు నిమజ్జనం చేయనున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 18న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ విగ్రహం ఏర్పాటైంది. 10 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న గణనాథుడు పదకొండో రోజు గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం కానున్నారు. పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచేలా ఏర్పాటు చేసిన ఈ గణనాథుడికి ముందుగా పాలు, పసుపు, కుంకుమలతో అభిషేకం, అనంతరం తుంగ భద్ర నది నీటితో ఫైరింజన్ల ద్వారా నిమజ్జనం చేస్తారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాటు చేసినట్లు సమితి ప్రతినిధి కల్యాణ్‌కుమార్ తెలిపారు. భక్తులందరూ నిమజ్జనోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మిల్లెట్ల వంటకం




మిలెట్లతో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన, జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి మిల్లెట్ ఆధారిత వంటకాన్ని తయారు చేసి గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పోషన్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ వంటకాల ప్రదర్శనను కలెక్టర్‌తో పాటు జేసీ నారపురెడ్డి మౌర్య, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ టేక్ హోం రేషన్‌లో భాగంగా ఇచ్చే రేషన్, పాలు, గుడ్లు, బాలామృతాలకు అంగన్‌వాడీలలో సక్రమంగా రిజిష్టర్లను నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీలలో పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రీస్కూలు ఎడ్యుకేషన్‌లో సూచించిన ప్రక్రియలను కచ్చితంగా పాటించాలన్నరు. బాల్యవివాహాల నివారణపై కూడా అంగన్‌వాడీలు దృష్టి సారించాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ టేక్ హోం రేషన్‌లో పోషకాలు ఉన్న రాగులు, అటుకులు, బెల్లం, డేట్స్ ఉంటాయని.. ప్రతి ఒక్కరూ వినియోగించేలా అంగన్‌వాడీలు అవగహన కల్పించాలన్నారు.

మానవీయతకు ప్రతిరూపం మహమ్మద్ ప్రవక్త

- నేడు మిలాద్ ఉన్ నబీ
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో జులూస్
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం


మదీనలోని ప్రవక్త సమాధి ఉన్న మస్జీదే నబవి మసీదు

కర్నూలు(రాజ్‌విహార్): మానవ జీవన గమనంలోని ప్రతి అడుగును సంస్కరించిన మహనీయుడు ఆయన. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు జీవించవలసిన శైలిని నిర్దేశించిన ఆదర్శప్రాయుడు. తల్లిదండ్రులు, కుటుంబం, వివాహ వ్యవస్థ, వ్యాపార శైలి ఇలా ప్రతి విషయంలో మనిషికి ఉండాల్సిన ఆదర్శ లక్షణాలను బోధించిన గొప్ప వ్యక్తి మహమ్మద్ ప్రవక్త. ఈయన పుట్టిన రోజునే మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారు. ఇస్లాం మతంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ వేడుక నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఘనంగా జరుగనుంది.

ఆదర్శనీయమైన ఆధ్యాత్మిక జీవనం

శాంతి, ధర్మం, సమానత్వం, తోటి వారి పట్ల ఎలా మెలగాలో నేర్పారు మహమ్మద్ ప్రవక్త. ముస్లింలను ఆధ్యాత్మిక చింతన వైపు నడిపించారు. అల్లాహ్ మార్గం అనుసరణీయమని ప్రపంచానికి చాటారు. ముస్లింల ఆరాధ్య దైవంగా నిలిచారు. ఇస్లాం మతాన్ని స్థాపించిన చివరి ప్రవక్త మహమ్మద్. ఈయన జన్మదిన వేడుకలను మిలాద్ ఉన్ నబీ అంటారు. 570 సంవత్సరం ఇస్లామిక్ మాసం రబ్బివుల్ అవ్వాల్‌లో 12వ తేదీన జన్మించారు. ఆయనకు 40వ ఏటా ప్రవక్తగా అల్లాహ్ నుంచి దూత జిబ్రయిల్ అలే సలాం నుంచి సందేశం లభించింది. తల్లి పాదాల కింద స్వర్గం, ఆ స్వర్గానికి తండ్రి ప్రధాన ద్వారం అని అల్లాహ్ సూచించినట్లు బోధనలు చేశారు. సగటు మనిషి సన్మార్గంలో ఎలా జీవించాలి, అల్లాహ్ అనుగ్రహం ఎలా పొందాలో స్పష్టం చేశారు. 63 ఏళ్ల పాటు ఎంతో ఆధ్యాత్మికంగా, అత్యంత ఆదర్శవంతంగా అల్లాహ్‌కు నచ్చిన తరహాలో జీవించిన ఆయన చివరకు అదే నెల రబ్బివుల్ అవ్వాల్‌లో స్వర్గస్తులయ్యారు.

నేడు జులూస్

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా రబ్బివుల్ అవ్వాల్ నెల 12వ తేదీన ముస్లింలు ప్రవక్తను, ఆయన జీవితాన్ని గుర్తు చేసుకుంటూ పండుగ చేసుకుంటారు. ప్రతి ఇంట్లో తీపి వంటలు చేసుకొని తింటారు. దీంతో పాటు పలు కమిటీల ఆధ్వర్యంలో జులూస్ పేరుతో ర్యాలీలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలోని కర్నూలు నగరంతో పాటు నంద్యాల, ఆదోని, ఆత్మకూరు, బనగానపల్లె, వెలుగోడు, గూడూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు వంటి పట్టణాల్లో ఈ కార్యక్రమాలు ఎంతో సంతోషంగా నిర్వహించుకుంటారు.

కార్యక్రమాలు ఇలా...

కర్నూలు నగరంలో సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషాఖాద్రీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు స్థానిక లతీఫ్ లావుబాలి మసీదు నుంచి ఖడక్‌పుర, వడ్డేగేరి, కిడ్స్ వరల్డ్ పార్క్, జిల్లా పరిషత్ మీదుగా రాజ్‌విహార్ వరకు జులూస్ నిర్వహించనున్నారు. ప్రవక్త జీవితాన్ని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు, రాజకీయ నాయకులు, మేధావులు, వివిధ మసీదుల ప్రతినిధులు, మత పెద్దలు హాజరు కానున్నారు.

- రోజా దర్గ పీఠాధిపతి సయ్యద్ షా దాదా బాషాఖాద్రీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు స్థానిక రోజా వీధిలోని దర్గా నుంచి జులూస్ ప్రారంభమై చిల్డ్రన్స్ పార్క్, పాత కంట్రోల్ మీదుగా కిడ్స్ వరల్డ్ వద్దకు చేరుకుని సెంట్రల్ మిలాద్ కమిటీ జులూస్‌లో చేరిపోతారు.
- కొత్తపేట, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్, సీ క్యాంప్ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున్న ర్యాలీగా రాజ్‌విహార్‌కు చేరుకుంటారు.

ఆచరణీయం ప్రవక్త జీవితం



మహమ్మద్ రసూలులల్లా (సొ.అ.వ.) జీవితం ప్రతి మనిషికి ఆచరణీయం. అల్లాహ్ ఆదేశాలు, పవిత్ర గ్రంథం ఖురాన్ సందేశాలను బోధించారు. శాంతి, ధర్మం, సమానత్వం, తొటి వారి పట్ల ఎలా మెలగాలో ఏర్పారు. తల్లిదండ్రులను గౌరవించడం, ఇస్లామిక్ ధర్మ సూత్రాలు ఈమాన్, నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్రలు తప్పని సరిగా పాటించాలని, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ప్రజా సేవ చేయాలని సూచించిన గొప్ప వ్యక్తి. – మౌలానా అబ్దుల్ జబ్బార్, కర్నూలు

ఆధ్యాత్మికత వైపు నడిపించారు



మహమ్మద్ ప్రవక్త ఆదర్శనీయులు. ఎంతో ఆదర్శవంతమైన, ఆచరణీయమైన జీవితాన్ని గడిపారు. మానవాళిని ఆధ్యాత్మికత వైపు నడిపించారు. సర్వమానవాళి శ్రేయస్సుకు ఎనలేని కృషి చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా నేడు కర్నూలు నగరంలో భారీ జులూస్ నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ తరలిరావాలి.

– సయ్యద్ షా షఫీ పాషాఖాద్రీ సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

అర్థమయ్యేలా విద్యాబోధన

- ఉపాధ్యాయులతో డీఈఓ రంగారెడ్డి


మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

కల్లూరు: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని డీఈఓ కె. రంగారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కల్లూరు జెడ్పీ పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, ముజఫర్‌నగర్, పెద్దపాడు పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం డీఈఓ శరీన్‌నగర్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఎఫ్ఏ-2 పరీక్షల నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. బోధన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీనివాసులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు


మాట్లాడుతున్న జేడీ రంగాలక్ష్మిదేవి

కోడుమూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేడీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అలాగే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఐకు నాన్‌బెయిలబుల్ వారెంట్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ పరిధిలో గతంలో ఉయ్యాలవాడ ఎస్ఐగా పని చేసిన మల్లికార్జునకు బుధవారం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. 2019లో మల్లికార్జున ఎస్ఐగా పనిచేస్తున్న కాలంలో వివిధ సెక్షన్లకు సంబంధించి ఆరు కేసులు నమోదు చేశారు. ఆయా కేసులకు ఎస్ఐ కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి ఉంది. అక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తుగ్గలి మండలానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి సాక్ష్యం చెప్పేందుకు కోర్టుకు హాజరు కాకపోవడంతో కోర్టు సీరియస్‌గా పరిగణించింది. ఈ మేరకు న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ ఎస్ఐకి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

మేల్ నర్సుపై వైద్యవిద్యార్థుల దాడి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తున్న మేల్ నర్సు ఇర్ఫాన్‌పై వైద్య విద్యార్థులు మంగళవారం రాత్రి దాడి చేశారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని జరిగిన ఊరేగింపులో సంతోష్ అనే యువకునికి ప్రమాదవశాత్తూ గాయాలయ్యాయి. అతనిని క్యాజువాలిటీకి చికిత్స కోసం పలువురు వైద్య విద్యార్థులు తీసుకువచ్చారు. సంతోష్‌తో పాటు ఎక్కువ మంది క్యాజువాలిటీలోకి రావడంతో అందరూ బయట ఉండాలని అక్కడే విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సు శేషమణి సూచించారు. చెప్పడానికి నువ్వెవరంటూ ఆమెపై వైద్య విద్యార్థులు దురుసుగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న మేల్ నర్సు ఇర్ఫాన్ వైద్య విద్యార్థులకు సర్దిచెప్పి బయటకు వెళ్లాలని కోరారు. నీవు కేవలం నర్సువని.. వైద్య విద్యార్థులమైన తమకే చెబుతావా.. అంటూ అతనిపైనా దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత క్యాజువాలిటీ బయటకు వచ్చిన ఇర్ఫాన్‌పై అక్కడే ఉన్న వైద్య విద్యార్థులు దాడికి దిగారు. వారిని ఔట్ పోస్టు పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది వారించి బయటకు పంపించారు. దాడికి సంబంధించి వైద్య విద్యార్థులపై మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మేల్ నర్సు ఇర్ఫాన్ ఫిర్యాదు చేశారు. అనంతరం బుధవారం ఉదయం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి జరిగిన విషయాన్ని వివరించారు. వారి వాదన విన్న ఆయన వైద్య విద్యార్థుల వివరణ కూడా తీసుకుంటానని జరిగిన సంఘటనపై విచారణ కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

భక్తా వెళ్లొస్తా!

- ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవం


క్రేన్ సాయంతో గణనాథుని నిమజ్జనం

కర్నూలు కల్చరల్: వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభమైన గణనాథుల నిమజ్జన వేడుక బుధవారం ఉదయం 11.10 గంటల వరకు కొనసాగింది. అత్యంత భారీ గణనాథులను ప్రతిష్ఠించడంతో వాటిని తరలించడంలో కొంత జాప్యం కావడం, నిమజ్జన ఘాట్‌ల్ క్రేన్‌లు మొరాయించడం, ప్రతి ఉత్సవ సమితి వారు ప్రధాన ఘాట్‌లోని క్రేన్‌తోనే తమ విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని పట్టుపట్టడంతో కాస్త నెమ్మదిగా సాగింది. కలెక్టరేట్‌లోని పరిపాలనా వినాయక విగ్రహంతో ప్రారంభమైన నిమజ్జనం చివరగా బుధవారపేట శ్రీ ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం విగ్రహానికి శ్రీ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా సమన్వయకర్త ఎం.నాగఫణి శాస్త్రి, జిల్లా కార్యాధ్యక్షులు సందడి సుధాకర్, నగర ఉపాధ్యక్షులు హరీష్‌బాబు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, త్రీటౌన్, తాలుకా పోలీస్ స్టేషన్‌ల సీఐలు మురళీధర్, శ్రీరామ్‌లు పూజ చేసి నిమజ్జనం చేశారు. జాతీయ గీతం, శాంతి మంత్రంతో వేడుకలు ముగిశాయి. నిమజ్జన వేడుక ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీ గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, డీఎస్పీ విజయశేఖర్ తెలిపారు. విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర శర్మ, గైరబోని వెంకటరాముడు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులు క్రిష్టన్న, నగర సహ ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, నగర ఉపాధ్యక్షులు కాశీ విశ్వనాథ్, గోరంట్ల రమణ, కోశాధికారి సుబ్రహ్మణ్యం, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు


అవార్డు స్వీకరిస్తున్న జిల్లా పర్యాటక శాఖ అధికారిణి విజయ


పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ దోలావతమ్మ

కర్నూలు కల్చరల్/నంద్యాల(అర్బన్): విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో బుధవారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారిణి పి.విజయ ఉత్తమ పర్యాటక, సాంస్కృతిక అధికారిగా అవార్డును స్వీకరించారు. అలాగే నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామం బెస్ట్ సివిక్ మేనేజ్‌మెంట్ ఆఫ్ టూరిస్ట్ డెస్టినేషన్ పురస్కారానికి ఎంపిక కావడంతో గ్రామ సర్పంచ్ డోలావతమ్మ అవార్డు అందుకున్నారు. వీరికి రాష్ట్ర క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఎండీ కన్నబాబు అవార్డులు అందజేశారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ అగు యు.తిరుమలేష్ తండ్రి యు.దేవన్న, ఇంటి నెం. 3-45, తొలిశపురం గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా వారి తరఫున తెలియజేయడం ఏమనగా..

నా క్లయింట్ క్రింది షెడ్యూలు దాఖల ప్లాటును జి.శశిరేఖ గారి G.P.A. యేజెంటు కొత్తింటి మహమ్మద్ రెడ్డి గారి నుండి తేది: 28-05-2020 నాడు రిజిష్టర్ దాఖ్యుమెంట్ నెం. 4522/2020 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు కొత్తింటి మహమ్మద్ రెడ్డి గారికి జి.శశిరేఖ గారు తేది: 24-02-2020 నాడు రిజిష్టర్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 2425/2020 గా జి.శశిరేఖ గారి తరఫున కొత్తింటి మహమ్మద్ రెడ్డి గారిని అటార్నీ ప్రతినిధిగా నియమించినారు. సదరు జి.శశిరేఖ గారు పి.సునీతారెడ్డి గారి G.P.A. యేజెంటు పి.లోకేశ్వరరెడ్డి గారి నుండి తేది: 27-07-2017 నాడు రిజిష్టర్ దాఖ్యుమెంట్ నెం. 6780/2017 ద్వారా విక్రయం పొందినారు. సదరు పి.లోకేశ్వరరెడ్డి గారికి పి.సునీతరెడ్డి గారు తేది 12-07-2017 నాడు రిజిష్టర్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం. 5977/2017గా పి.సునీతరెడ్డి గారి తరఫున పి.లోకేశ్వరరెడ్డి గారిని అటార్నీ ప్రతినిధిగా నియమించినారు. సదరు పి.సునిత గారు వై.వేదవతి గారి నుండి తేది: 28-07-2010 నాడు రిజిష్టర్ దాఖ్యుమెంట్ నెం. 5941/2010 ద్వారా కొనుగోలు చేసినారు. నా క్లయింట్ క్రింది షెడ్యూలు దాఖల ప్లాటును జి.శశిరేఖ గారి G.P.A యేజెంటు కొత్తింటి మహమ్మద్‌రెడ్డి గారి నుండి కొనుగోలు చేసినప్పుడు పైన తెలిపిన అన్ని ఒరిజినల్ దాఖ్యుమెంట్స్ నా క్లయింట్‌కు ఇచ్చినారు. నా క్లయింట్ అగు యు.తిరుమలేష్ గారు తేది: 05-09-2023 నాడు కర్నూలు ఏ.పి.యస్.ఆర్.టి.సి. బస్టాండు దగ్గర జిరాక్స్ సెంటర్‌కు పోవుచున్నప్పుడు మార్గమధ్యంలో క్రింది షెడ్యూలు దాఖల ప్లాటుకు సంబంధించిన లింక్ దాఖ్యుమెంట్ అనగా దాఖ్యుమెంట్ నెం. 5941/2010 తేది: 28-07-2010 పోయినది. ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా సదరు ఒరిజినల్ దాఖ్యుమెంట్ నెం. 5941/2010 తేది: 28-07-2010 ఎవరికైనను దొరికినచో నన్ను గాని నా క్లయింట్‌ను గాని సంప్రదించగలరు. అట్టి వారికి తగిన పారితోషికం ఇవ్వబడునని తెలియజేయడమైనది. అలాగే క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ఎవరికైననూ ఎలాంటి హక్కు అధికారములు ఉన్నచో ఈ ప్రకటన తేదీ నుండి పది రోజుల లోపల సరియైన ఆధారములతో నన్ను సంప్రదించగలరు. తరువాత ఎలాంటి అభ్యంతరములు వచ్చిననూ చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: కర్నూలు డి., కల్లూరు సబ్.డి., కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన 76వ వార్డుకు సమీపమున గల కల్లూరు గ్రామ సర్వే నెంబరు: 112/3బి ఈ సర్వేనెంబరు గల భూమిలో వేయబడిన ప్లాట్లను ఇండ్ల ప్లాట్లకు నిర్ణయించి హైదరాబాద్ టౌన్ ప్లానింగ్ వారి నుండి LP No. 559/85గా అప్రూవల్ కాబడిన ప్లాను దాఖలా "పద్మావతి నగర్" నందలి ప్లాట్లపైకి ప్లాటు నెంబరు: 46లో ఉత్తరదిశ భాగము స్థలమునకు చెక్కుబంది మరియు కొలతలు: **చెక్కుబంది: తూర్పు:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర:** ప్లాటు నెంబరు 36, **ఉత్తరము:** ప్లాటు నెంబరు 45, **దక్షిణం:** ఇదే నెంబరు ప్లాటులో మిగులు ప్లాటు స్థలము ఈ నలుదిశలకు లోనైన ప్లాటు కొలతలు: **తూర్పు-పడమర: 55' (లేక) 16.7640 మీటర్లు, ఉత్తర-దక్షిణం: 20' (లేక) 6.0960 మీటర్లు. ఈ ప్లాటు పూర్తి విస్తీర్ణము : 1100 చ.అ. లేక 122.22 చ.గలు**

T.Narayana Reddy, Advocate, Kurnool. Cell: 93938 30666


అవార్డులు అందుకుంటున్న సాక్షి ఫొటో గ్రాఫర్లు హుసేన్, శ్రీనివాసులు

ప్రతిభకు పురస్కారం

కర్నూలు(సెంట్రల్) : ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో సాక్షి ఫొటో గ్రాఫర్ల డి.హుస్సేన్, వి.శ్రీనివాసులుకు పురస్కారాలు లభించాయి. ఛాయ చిత్రాల ప్రదర్శనలో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బుధవారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు సీసీఎల్ కమిషనర్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, పర్యాటక శాఖ డైరెక్టర్, సీఈఓ మల్లికార్జున రావు, డీన్ ఎదార శ్రీనివాసరెడ్డి వారికి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు.

శాస్త్రీయంగా గొర్రెలు, మేకల పెంపకం

కర్నూలు(అగ్రికల్చర్): శాస్త్రీయ పద్ధతులతో గొర్రెల పెంపకాన్ని చేపడితే లాభసాటిగా ఉంటుందని జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం కర్నూలు కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్ధ పశువైద్యశాల ప్రాంగణంలో కర్నూలు, నంద్యాల జిల్లాల గొర్రెల పెంపకందారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యాక్రమంలో ఆయన మాట్లాడారు. గొర్రెల పెంపకంలో తగిన అవగాహన లేకపోవడంతోనే పెంపకందారులు నష్టపోతున్నారన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్ మాట్లాడుతూ గొర్రెల పెంపకంలో విత్తన పొట్టేళ్లు కీలకమైనవని, విత్తనపు పొట్టేళ్ల జాతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నెల్లూరు బ్రౌన్, జొడిపి జాతులతో గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాల జాతులను కూడా వినియోగించవచ్చన్నారు. గొర్రెలు, మేకలు అభివృద్ధి చెందాలంటే కాయ, గింజ జాతి పశుగ్రాసాలు ఇవ్వాలని, పోషక విలువలు కలిగిన దాణా ఇవ్వాలని సూచించారు. బహుళార్ధ పశువైద్య శాల డీడీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ నట్టల నివారణ మందులు తాపడం వల్ల గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. గొర్రెల పెంపకాన్ని మరింత విస్తరింపచేసేందుకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు, ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణా కేంద్రం ఏడీ రామసుబ్బారెడ్డి, విశాఖపట్టణం శిక్షణా కేంద్రం అధికారి అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న శ్రీశైలం డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. కొద్దిరోజులుగా ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 91.4060 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 854.80 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల నుంచి 12,280 క్యూసెక్కుల వరద నీరు డ్యాంకు వచ్చి చేరుతుంది. డ్యాం నుంచి దిగువ ప్రాంతాలకు 9,163 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 1.678 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు - నంద్యాల రోడ్, ఓర్వకల్లులో జుడీషియల్ సిటీకి దగ్గరలో ఓపెన్ ప్లాట్లు & కర్నూలు-జోన్ రోడ్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు దగ్గరలో 3 సెంట్ల ప్లాట్లు కలవు. 99638 00314 [L-781006]

FLAT FOR SALE

■ MS9 తపస్య అపార్ట్‌మెంట్ నందు 2BHK ఫ్లాట్స్ 3rd&5th ఫ్లోర్ 1127 SFT తో గృహ ప్రవేశానికి సిద్ధముగా కలవు. మేయర్ క్యాంప్ ఎదురుగా, సి.క్యాంపు, కర్నూలు. 73864 41587 [L-781009]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6701]

WANTED

■ మా సంస్థలో పనిచేయుటకు మండలం వారీగా కో-ఆర్డినేటర్స్ పురుషులు కావలెను. అర్హత: ఇంటర్+డిగ్రీ+ కంప్యూటర్స్. జీతం: 12-15 వేలు. రిజిస్ట్రేషన్ ఫీజు కలదు. 73311 50057 [L-781008]

■ కర్నూలు దిన్నెదేవరపాడు దగ్గరలోగల పవర్ ప్లాంట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. అర్హత: 10 th P/F జీ: 12,000. సంప్ర: 95817 76924, 25 [L-1162713]

■ కర్నూలు నగరంలోని A క్యాంప్‌లో ప్రముఖ అపార్ట్‌మెంట్ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గంటల డ్యూటీ, జీతం.9000/- వివరాలకు: 91829 64173 [L-798812]

■ న్యూ స్కంద రియల్ ఎస్టేట్ (సంస్థ నందు), ఫామ్ ల్యాండ్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను (M/F). అర్హత 10 to Degree Exp:1Year Con:93981 47560 [L-1162711]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000 ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 9391753308. [HA-654]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

■ "జాబ్ గ్యారెంటీ" మా కంపెనీ కొరకు మహిళలు /పురుషులు అర్జెంటుగా కావలెను. జీతం: 20,000/-వరకు, ఫ్రీ రూం+భోజనం, మ్యాన్ పవర్ ఏజెంట్స్ కావలెను.(5 వేల వరకు కమీషన్)8886733005/08 [H-793351]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'మాఘీ జొన్న'లో సస్యరక్షణే కీలకం

- కత్తెర, కాండం తొలుచు పురుగుతో తీవ్ర పంట నష్టం
- మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు
- ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ



నంద్యాల(సెంట్రల్): మాఘి జొన్న సాగులో సస్యరక్షణ కీలకమని నంద్యాల ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సరళమ్మ తెలిపారు. వ్యవసాధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఆమె సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో ఇప్పటి దాకా 504 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గానూ 372 మిల్లీమీటర్లు (26.2 శాతం లోటు వర్షపాతం) నమోదైంది. సాధారణ సాగు విస్తీర్ణం 2.38 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి దాకా 1.74 లక్షల హెక్టార్లు(73శాతం) సాగైంది. ఈ సమయంలో జిల్లా వ్యాప్తంగా అధికంగా సాగయ్యే మాఘి జొన్నలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై ఆమె విషయాలు తెలిపారు. ఆమె మాటల్లోనే..

మాఘీ జొన్నలో యాజమాన్య పద్ధతులు

మాఘీలో ఎన్‌టీజే-5, పీఎస్‌వీ-56, ఎన్-15(పచ్చజొన్న) రకాలు అనుకూలం. ఎకరాలకు 3-4 కిలోల విత్తనం అవసరం. వరసల మధ్యలో 45 సెం.మీ, మొక్కల మధ్యలో 15 సెం.మీ ఎడంతో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం లేదా 1.5 గ్రాముల టెబ్యూకొనజోల్ 2 శాతం మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాక్సాం మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. జొన్న పంటకు 24 నుంచి 34 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాషియం అవసరం. ఎకరాకు 70 కిలోల యూరియా సమ దఫాలుగా విత్తేటప్పుడు మోకాలి ఎత్తు దశలో వేసుకోవాలి. కలుపు నివారణకు అట్రాజిన్ 50 శాతం పొడి మందును ఎకరాకు 800 గ్రాములు 250 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా రెండు రోజుల లోపల తేమ ఉన్నప్పుడు పిచికారీ చేసుకోవాలి.

చీడపీడల నివారణ

జొన్నలో ప్రధానమైన సమస్యలు కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగు. కత్తెర పురుగు నివారణకు 20-30 రోజుల దశలో 5 శాతం వేపగింజల కాషాయాన్ని లేదా అజాడిరెక్టిన్ 1500 పీపీఎం మందులను లీటరు నీటకి 5 మిల్లీలీటర్ల మందును కలిపి పిచికారీ చేయాలి. 40-50 రోజుల దశలో విషపు ఎర(10 కిలోల తవుడు మరియు 2 కిలోల బెల్లాన్ని 2-3 లీటర్ల నీటిలో 24 గంటలు నానబెట్టి దీనికి 100 గ్రాముల థయోడికార్బ్ మందును 30 నిమిషాల ముందు కలుపుకోవాలి. లేదా స్పైనోసాడ్ మందును లీటరు నీటికి 0.3 మి.లీ లేదా క్లోరంట్రినిప్రోల్ 18.5 ఎస్.సి. లీటరు నీటికి 0.3 మి.లీ. కలిపి10-15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు పైరును 30 రోజుల తర్వాత నుంచి పంట కోసే వరకు ఆశిస్తుంది. గుండ్రని వరుస రంధ్రాలు ఆకులపై ఏర్పడతాయి. మొవ్వ చనిపోయి తెల్ల కంకి ఏర్పడుతుంది. కాండాన్ని చీల్చి చూస్తే ఎర్రని కణజాలం కనపడుతుంది. కంకి మొవ్వులో నుంచి బయటకు రాదు. నివారణకు క్లోరాంట్రినిలిప్రోల్ 0.3 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా విత్తిన 35-40 రోజుల్లోపు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యురాన్ కాండపు సుడుల్లో వేయాలి.


మాఘీ జొన్న


కత్తెర పురుగు ఆశించిన జొన్న పైరు